క్లుప్తంగా

గోమాతకు ప్రత్యేక పూజలు



ఆవుదూడకు పూజలు చేస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం జరిగిన పూజలో ఆవు దూడకు శివ దత్త అని నామకరణం చేశారు. గణపతి పూజ పుణ్యావచన శుద్ధితో నిర్వహించారు. ఆవు దూడను ప్రత్యేకంగా అలంకరించి మొక్కులు తీర్చుకున్నారు. డోలోత్సవం, అన్నప్రాసన జరిగాయి. మాతృమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

థెరీసమ్మకు నివాళి



నివాళులర్పిస్తున్న ఆదిమూలపు సతీష్ తదితరులు

కర్నూలు(సెంట్రల్): మైపర్ ఫార్మసీ కళాశాలలో వ్యవస్థాపకురాలు థెరీసమ్మ రెండో వర్ధంతిని పురస్కరించుకొని నివాళులర్పించారు. గురువారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆమె రెండో వర్ధంతిని పురస్కరించుకొని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అకాడమిక్ డీన్ స్టెల్లా సతీష్, కళాశాల వైస్ చైర్మన్ కాసర్ల సురేష్, రఘువీర్, ఎస్ఆర్‌సీసీ బీఈడీ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రకాష్ పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



డైరీలు, క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): రానున్న నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆవాజ్ నగర కమిటీ సభ్యుడు అబ్దుల్ ఇంతియాజ్ 2025 డైరీ, క్యాలెండర్లను రూపొందించారు. స్థానిక సుందరయ్య భవన్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, జిల్లా కార్యవర్గ సభ్యురాలు పి.నిర్మల, సీపీఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, ఆవాజ్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పి.ఇక్బాల్ హుస్సేన్, ఎస్ఎండీ షరీఫ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకున్నారు. నూతన సంవత్సరంలో ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని, సంకల సంపదలు కలగాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.

ఘనంగా రఫీ శత జయంతి



మహమ్మద్ రఫీకి శ్రద్ధాంజలి ఘటిస్తున్న కళాకారులు

కర్నూలు న్యూసిటీ: అమర గాయకుడు, హిందీ పాటల చక్రవర్తి మహమ్మద్ రఫీ శత జయంతి వేడుకలను టీజీవీ కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు గురువారం రఫీ చిత్రపటానికి కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కార్యదర్శి మియా, గాయకులు ఇబ్రహీం పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఇబ్రహీం మాట్లాడుతూ.. హిందీ పాటల్లో ఆయన స్వరం మేటి అన్నారు. తెలుగులో కూడా ఆయన పాటలు శ్రోతలను ఆకట్టుకున్నాయని గుర్తుచేశారు. గాయకులు సుధాకర్ ప్రియాంక, ఇబ్రహీం, ఎల్లప్ప తదితరులు హిందీ నాటలను ఆలపించారు.

నేడు ఉర్దూ వర్సిటీలో 'గాలిబ్ డే'

కర్నూలు కల్చరల్: డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఉర్దూ కవి మిర్జా గాలిబ్ జయంతి పురస్కరించుకొని గాలిబ్ డే వేడుక నిర్వహించనున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్.లోకనాథ తెలిపారు. విద్యార్థులు అందరూ పాల్గొనాలని సూచించారు.

వైభవంగా తిరుప్పావడ సేవ

ధనుర్మాస వ్రత మహోత్సవంలో భాగంగా గురువారం స్థానిక భరత మాత ఆలయంలో వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు మధుసూదన ఆచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి వివిధ రకాల ఆహార పదార్థాలతో తిరుప్పావడ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. తర్వాత ఆ ఆహార పదార్థాలను ప్రసాదంగా భక్తులకు పంచిపెట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, భరత మాత దేవాలయం అధ్యక్షుడు సందడి మహేష్, సహ కార్యదర్శి ప్రతాపరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. – కర్నూలు కల్చరల్



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామి



పూజల్లో పాల్గొన్న భక్తులు



ఆహార పదార్థాలతో స్వామివారి రూపం

పెంచిన విద్యుత్ చార్జీలపై నేడు 'వైఎస్సార్‌సీపీ పోరుబాట'

కల్లూరు: కూటమి సర్కార్ పెంచిన విద్యుత్ చార్జీలను నిరసిస్తూ శుక్రవారం వైఎస్సార్‌సీపీ పోరుబాట నిర్వహిస్తుందని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక స్వగృహంలోని తన కార్యాలయం నుంచి బళ్లారి చౌరస్తా మీదుగా విద్యుత్ ఎస్ఈ కార్యాలయం వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల సందర్భంగా కరెంట్ చార్జీలు ఏ మాత్రం పెంచనంటూ ప్రజలన మభ్యపెట్టి గద్దెనెక్కిన సీఎం చంద్రబాబు తీరును నిరసిస్తూ ప్రజల పక్షాన చేపట్టిన వైఎస్సార్‌సీపీ పోరుబాటకు పార్టీ శ్రేణులతోపాటు అభిమానులు, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కేవలం ఆరు నెలలో రూ.15వేల కోట్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై మోపుతున్న కూటమి సర్కార్ తీరును ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలన్నారు.

వైద్య పరీక్షలకు బయటకు పంపితే చర్యలు

కర్నూలు(హాస్పిటల్): రోగులకు వైద్య పరీక్షలకు సంబంధించి బయటి ల్యాబ్‌లకు పంపితే చర్యలు తీసుకుంటామని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. గురువారం ఆసుపత్రిలోని పలు విభాగాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీడియాట్రిక్, గైనిక్, మెడికల్, ఏఎంసీ విభాగాలను తనిఖీ చేసి అక్కడి రోగుల కేస్ షీట్లను పరిశీలించి, వైద్య పరీక్షల గురించి ఆరా తీశారు. రోగుల వైద్య పరీక్షలకు సంబంధించి బయటకు పంపించవద్దని ఆదేశించారు. ఆసుపత్రిలో అవసరమైన ల్యాబ్ టెస్టులు అన్నీ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రోగులకు వైద్య పరీక్షల కోసం న్యూ డయాగ్నోస్టిక్ విభాగానికి పంపించాలని వైద్యులకు, సిబ్బందికి చెప్పారు. వైద్యపరీక్షల కోసం ఓపీ లేకుండా బయటి వారు రాకుండా చూసుకోవాలన్నారు. ఆయన వెంట సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వర రావు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాలనాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్ వన్ సావిత్రిబాయి ఉన్నారు.

సీపీఐ శత వసంత వేడుకలు



అరుణ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య

కర్నూలు(సెంట్రల్): సీపీఐ ఆవిర్భవించి నూరేళ్లు అయిన నేపథ్యంలో ఆ పార్టీ శత వసంత వేడుకలను చేపట్టింది. గురువారం సీపీఐ జిల్లా కార్యాలయంలో నగర అధ్యక్షుడు పి.రామకృష్ణారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన వేడుకల్లో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సీపీఐ కార్యాలయం ఎదుట ఉన్న జెండా కట్టపై పార్టీ నాయకులు మునెప్ప లలితమ్మ, శ్రావణి, భారతి కేకును కట్ చేసి కార్యకర్తలకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా బి.గిడ్డయ్య మాట్లాడుతూ.. రష్యాలోని అక్టోబర్ విప్లవ స్ఫూర్తితో 1925 డిసెంబర్ 26వ తేదీన భారత కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా ఆవిర్భవించి, పుట్టిల్లలోనే పిడికిలి బిగించి భారత దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని తీర్మానం చేసిన మొట్టమొదటి పార్టీ అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం హైదరాబాద్, మణిపూర్ సంస్థానాలను విలీనం చేయడంలోనూ పోరాటాలు ఉన్నాయన్నారు. శత వసంత ఉద్యమ స్ఫూర్తితో బీజేపీ మతోన్మాదంపై పోరాటాలకు సిద్ధం కావాలని, పార్టీ శత జయంతి ఉత్సవాలను ఏడాది పాటు ఘనంగా నిర్వహించాలని సూచించారు. నాయకులు జి.చంద్రశేఖర్, సి.మహేష్, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జ్ఞాన సముపార్జనతో జీవన్ముక్తి



మాట్లాడుతున్న రాధా మనోహర్ దాస్, పాల్గొన్న భక్తులు

కర్నూలు న్యూసిటీ: జ్ఞాన సముపార్జనతో జీవన్ముక్తి కలుగుతుందని అదే నిజమైన ఆనందమని ధర్మ ప్రచారకులు రాధామోహన్ దాస్ స్వామి భక్తులకు ఉపదేశించారు. ధనుర్మాసం సందర్భంగా నగర శివారులోని గోదాగోకులంలో జరుగుతున్న ధార్మిక కార్యక్రమంలో ఆయన గురువారం పాల్గొని ప్రసంగించారు. గోదా అంటే సకల సంపదలను ప్రసాదించే తల్లి అన్నారు. నియమ నిష్ఠలతో భగవంతుడిని సేవిస్తే సకల సంపదలు మన వశమవుతాయని, ఇందుకు గోదాదేవి తన భక్తి మార్గం ద్వారా మనకు నిదర్శనంగా నిలిచిందన్నారు. ద్రవిడ వేదంగా విరాజిల్లుతున్న తిరుప్పావై పాశురాల పారాయణం అనంత పుణ్యమని మధుర భక్తికి నిదర్శనమని అన్నారు. కార్యక్రమంలో గోదాగోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజుగుప్త, చైర్మన్ పల్లెల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతతో గర్భిణుల్లో అనారోగ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ ఫర్వీన్ తబస్సుమ్

కర్నూలు(హాస్పిటల్): రక్తహీనత వల్ల గర్భిణుల్లో పలు ఆరోగ్య సమస్యలు వస్తాయని శరీన్‌నగర్ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఫర్వీన్ తబస్సుమ్ చెప్పారు. గురువారం శరీన్‌నగర్ యూపీహెచ్‌సీలో గర్భిణులు, బాలింతలకు ఆమె రక్తహీనతపై అవగాహన కల్పించారు. రక్తహీనత కారణంగా నీరసం, నెలసరి సమయంలో హెచ్చు తగ్గులు, గర్భం ధరించలేకపోవడం, గర్భం వచ్చినా నిలబడకపోవడం, ప్రసూతి మరణాలు పెరిగిపోవడం వంటి సమస్యలు వస్తాయని చెప్పారు. ఈ కేంద్రంలో ప్రతి గురువారం గర్భిణులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్త్రీ వ్యాధి నిపుణులు స్కానింగ్ చేస్తారన్నారు. మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ రక్తహీనతను అధిగమించాలంటే ఐరన్ అధికంగా ఉన్న ఆకుకూరలు, పండ్లు, ఖర్జూరాలు, దానిమ్మ, చిక్కుడు కాయలు లాంటి ఆహార పదార్థాలు తీసుకోవాలని, ప్రభుత్వం అందించే ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వాడాలని, జంక్‌ఫుడ్స్, శీతల పానీయాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఆరోగ్య విద్యాబోధకులు పద్మావతి, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

28న రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలు

కర్నూలు (టౌన్): గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం పెనుమాక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఈనెల 28, 29 తేదీల్లో రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ త్రోబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొంటున్న క్రీడాకారులు తమ వెంట నాలుగు సెట్ల ఎలిజిబిలిటీ ఫార్మ్, మార్కుల మెమో, ఆధార్ జిరాక్స్, బోనఫైడ్ సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు తీసుకురావాలని సూచించారు.

నర్సింగ్ విద్యార్థినుల ప్రతిభ

కర్నూలు(హాస్పిటల్): డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్స్, విజయవాడ వారు 2023–2024వ వార్షిక సంవత్సర బీఎస్సీ నర్సింగ్ కోర్సు పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. ఇందులో కర్నూలు నగర శివారులోని కళాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (కిమ్స్) నర్సింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఫలితాలలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు వరుసగా 20 డిస్టింక్షన్లు, 45 ఫస్ట్‌క్లాస్‌లు, 10 మంది సెండ్ క్లాస్‌లలో ఉత్తీర్ణులైనట్లు కళాశాల చైర్మన్ పెరుగు విజయవర్ధన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల యావరేజ్ ఉత్తీర్ణత 80 శాతం ఉందని, కాలేజీ టాపర్లుగా ఎస్.వర్ష, సి.నవీన్‌కుమార్, ఎమ్.రవితేజ, ఇందుశ్రీగా నిలిచారన్నారు.

వికసిత్ భారత్ పోటీలకు ఎంపిక



ముల్లా జాస్మిన్ జహాన్

కర్నూలు న్యూసిటీ: నేషనల్ యూత్ ఫెస్టివల్–2025ను పురస్కరించుకుని ఎన్.ఎస్.ఎస్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ యంగ్ లీడర్ డైలాగ్ అనే అంశంపై నిర్వహించిన ఫేజ్–2 వ్యాసరచన పోటీల్లో డాక్టర్ అబ్దుల్‌హక్ ఉర్దూ యూనివర్సిటీకి చెందిన ముల్లా జాస్మిన్ జహాన్ ప్రతిభ కనబరచి ఫేజ్ –3 పోటీలకు ఎంపికై ంది. ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించిన ఫేజ్ –2 వ్యాసరచన పోటీల్లో మహిళా సాధికారత, దాని సామాజిక సూచికలు అనే అంశంపై ఆమె తన వ్యాసాన్ని సమర్పించింది. ఈ దశలో రాష్ట్ర వ్యాప్తంగా 250 మంది విద్యార్థులు పాల్గొనగా వీరిలో 25 మంది విద్యార్థులను ఉన్నత విద్యామండలి ఫేజ్ –3 దశకు ఎంపిక చేసింది. ఈ నెల 30వ తేదీన గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో జరిగే ఫేజ్–3 పోటీల్లో మహిళా సాధికారత, సామాజిక సూచికలు అనే అంశంపై ప్రదర్శించనుంది.

కోల్స్ చర్చిలో క్రిస్మస్ క్రీడా పోటీలు



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న చర్చి పాస్టర్లు

కర్నూలు (టౌన్): క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకొని కోల్స్ చర్చి క్రిస్మస్ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను చర్చి పాస్టర్లు రెవరెండ్ అనిల్ సామేల్, జీవన్‌రావు, చర్చి అధ్యక్షుడు అబ్రహాం లింకన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పర్వదినాల్లో సంఘ సభ్యుల మానసికోల్లాసం కోసం క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కోల్స్ చర్చిలో ఎంతో మంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించడం సంతోషించదగ్గ విషయమన్నారు. జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులను చర్చి తరపున ప్రోత్సహించి క్రీడాభివృద్ధికి పాటుపడతామన్నారు. అనంతరం వాలీబాల్, మినీ ఫుట్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్, క్యారమ్స్, త్రో బాల్, టెన్నిస్, హాకీ వంటి క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రీడల నిర్వహణ కన్వీనర్ పి.విజయ్‌కుమార్ వెల్లడించారు. క్రిస్మస్ కమిటీ నిర్వాహక సభ్యులు ముత్యాల భాస్కర్, రూఫస్‌రొనాల్డ్, దాసరి సుధీర్, పాల్ సుధాకర్, ప్రసన్నదత్, డేవిడ్ సుశీల్ పాల్గొన్నారు.



అడవి పందులు పంటను ధ్వంసం చేయడంతో పశువులకు వదిలేసిన దృశ్యం

పంటపై పందుల దాడి



గడివేములలో మొక్కజొన్న పంటను నాశనం చేసిన పందులు

కర్నూలు(రూరల్): వర్షాభావ పరిస్థితులు అన్నదాతను వెంటాడుతుండగా అడవి పందులు సైతం రైతులను దెబ్బతీస్తున్నాయి. కర్నూలు మండల పరిధిలోని పూడూరు గ్రామం పొలాలు అటవీ సమీపాన ఉండడంతో రైతులు నష్టపోతూనే ఉన్నారు. పూడూరు గ్రామానికి చెందిన రైతు బోయ గోపాల్ సాగు చేసిన మొక్కజొన్నను బుధవారం రాత్రి అడవి పందులు నాశనం చేశాయి. అటవీ సమీపాన ఈ పొలం ఉండడంతో పందుల గుంపు మొక్కజొన్న పంటను ధ్వంసం చేశాయి. దీంతో చేసేదీమీ లేక ఆ రైతు మొక్కజొన్నను పశువులకు మేతగా వదిలేశాడు. ప్రతికూల పరిస్థితులకు ఎదురొడ్డి కాపాడుకున్న పంటను పందులు ధ్వంసం చేశాయని రైతు గోపాల్ ఆందోళన వ్యక్తం చేశాడు. పెట్టుబడి ఖర్చులు రూ. 50 వేలు అయ్యిందని, ప్రభుత్వమే ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

గడివేముల: పంటలపై ఊర పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రం గడివేముల సమీపంలో ఉన్న పంటలపై పందులు దాడులు చేస్తూ రైతులకు హడలెత్తిస్తున్నాయి. గ్రామానికి చెందిన చాంద్ బాషా గ్రామ సమీపంలో 6 ఆరు ఎకరాలు కౌలుకు తీసుకొని మొక్కజొన్న, మినుములు సాగు చేశాడు. గ్రామ సమీపంలో పొలం ఉండడంతో పందులు తొక్కిసలాడి పంటలను పూర్తిగా నాశనం చేశాయి. పందుల బారి నుంచి పంటలను రక్షించుకునేందుకు రైతులు అగచాట్లకు గురవుతున్నారు. పందుల యాజమానులకు పలుమార్లు సమస్యను వివరించినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి పందుల యాజమానులతో మాట్లాడి పంటలకు నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



వాల్ పోస్టర్లనువిడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): సీపీఎం జిల్లా 23వ మహాసభలను ఎమ్మిగనూరులో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ తెలిపారు. ఈనెల 29, 30 తేదీల్లో రెండు రోజులపాటు జరిగే మహాసభల్లో పలు తీర్మానాలను ప్రవేశపెట్టి జిల్లా అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని వివరించారు. గురువారం సుందరయ్య భవన్‌లో జిల్లా మహాసభల పోస్టర్లను సీపీఎం నాయకులు డి.గౌస్‌దేశాయ్, జి.రామకృష్ణ, ఎండీ ఆనంద్‌బాబు, ఎం.రాజశేఖర్, టి.రాముడు ఆవిష్కరించారు. 29వ తేదీన ఎమ్మిగనూరులో బహిరంగసభ ఉంటుందని, 30వ తేదీన ప్రతినిధుల సభలు ఉంటాయని వారు వివరించారు.

రిటైర్డ్ ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలు చెల్లించాలి

కర్నూలు(సెంట్రల్): పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాలను వెంటనే చెల్లించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీజీ వెంకటరాముడు, గట్టు తిమ్మప్ప గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏప్రిల్‌లో పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ఇప్పటివరకు పీఎఫ్, ఏపీ జీఎల్ఐ రుణాలను వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని కోరారు. వేతన సవరణ సంఘాన్ని వెంటనే నియమించాలని, 30 శాతం తాత్కాలిక భృతిని చెల్లించాలన్నారు. ఉపాధ్యాయులు బదిలీల కనీస కాలాన్నీ రెండు అకాడమిక్ సంవత్సరాలను పరిగణలోకి తీసుకొని నిర్దేశించాలన్నారు. కేటగిరీ–3 విషయంలో బస్సు సౌకర్యాన్ని పరిగణలోకి తీసుకొని పాయింట్లు కేటాయించాలన్నారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు సమాంతర మధ్యమాన్ని కొనసాగించాలని, ప్రాథమికోన్నత పాఠశాలలను కొనసాగించాలని కోరారు.

ఇంటర్ బోర్డులో 'నారాయణ' పెత్తనం తగదు

కర్నూలు(సెంట్రల్): ఇంటర్ బోర్డు పునర్ వ్యవస్థీకరణలో భాగంగా నారాయణ జూనియర్ కాలేజీల్లో పనిచేసే ప్రిన్సిపాళ్లను నామినేటెడ్ సభ్యులుగా నియమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరెడ్డి, హరీస్‌కుమార్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఇష్టానుసారంగా నారాయణ కాలేజీల ప్రిన్సిపాళ్లను ఇంటర్ బోర్డులో నామినేటెడ్ చేయడానికి పూనుకోవడం దారుణమని పేర్కొన్నారు. ఇప్పటికే నారాయణ, చైతన్య కాలేజీల రాకతో ఇంటర్ విద్య పూర్తిగా నాశనం అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో వారి సిబ్బందినే బోర్డులో నియమిస్తే మొత్తం ప్రభుత్వ కళాశాలలను మూయించే ప్రయత్నం చేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు.

గిప్సన్ చర్చిలో ఆటల పోటీలు



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న చర్చి పాస్టర్ కృపాదానం రాజు

కర్నూలు (టౌన్): క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని గురువారం గిప్సన్ సెంట్రల్ బాప్టిస్టు చర్చిలో ఆటల పోటీలు నిర్వహించారు. చర్చి పాస్టర్ కృపాదానం రాజ్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాస్టర్ మాట్లాడుతూ.. ప్రతి ఏడాది చర్చిలో క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. చిన్నారులు, విద్యార్థినీ, విద్యార్థులు క్రీడల్లో పాల్గొనాలన్నారు. అనంతరం సండే స్కూల్ పిల్లలకు రన్నింగ్, టగ్–ఆఫ్–వార్, త్రోబాట్ పోటీలు నిర్వహించారు.

ఏపీలో అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ ఏర్పాటు చేయాలి

కర్నూలు(సెంట్రల్): ఆంధ్రప్రదేశ్‌లో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని డీసీసీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజనకు ముందు హైదరాబాద్‌లో ఉండే అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలోనే ఏపీ, తెలంగాణ విద్యార్థులు అడ్మిషన్ పొంది చదువుకునేవారని వివరించారు. అయితే ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ఏపీ విద్యార్థులకు అడ్మిషన్లు నిరాకరిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని, ఈ క్రమంలో ఏపీలోనూ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని, హైదరబాద్‌లో ఉన్న వర్సిటీలో ఏపీ వాటాను డిమాండ్ చేయాలని ప్రభుత్వానికి సూచించారు.